రక్తహీనతను నివారించడానికి పోషణ్ పక్వాడ

సర్పంచ్‌లు నారాయణస్వామి, దూగాన భద్రాచలం, సనపల జానకిరావు

విశాలాంధ్ర - కవిటి : గర్భవతులు, బాలింతలు, పిల్లలు తప్పనిసరిగా క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని మిల్లెట్స్ ని ఎక్కువగా ఉపయోగించుకోవడం వల్ల రక్తహీనత నివారించవచ్చునని సర్పంచులు ఎస్పీ నారాయణ స్వామి, దూగాన భద్రాచలం, సనపల జానకిరావు తెలియ జేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బెజ్జిపుట్టుగ, రాజపురం గ్రామలలో ఇచ్ఛాపురం ప్రాజెక్టు మాణిక్య పురం సెక్టార్ పరిధిలో గల బెజ్జి పుట్టుగ,రాజపురం అంగన్ వాడి కేంద్రం ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా వాసం పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచులు ఎస్పీ నారాయణ స్వామి, దూగాన భద్రాచలం మాట్లాడుతూ పోషకాహారం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాటును ప్రోత్స హించటం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్చి 20 తేదీ నుండి ఏప్రిల్ మూడవ తేదీ వరకు 15 రోజుల పాటు పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని తెలిపారు. రక్తహీనత, ఐరన్, విటమిన్ సి లోపం ఏర్పడకుండా ఉండేందుకు అవి అధికముగా ఉండే ఆహారం మిల్లెట్స్ పై అవగాహనా కల్పించారు. అనంతరం వివిధ రకాల పిండి వంటలను ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిన్నారి,వీఆర్వో గిరి బాబు, అంగన్వాడి సూపర్వైజర్, సచివాలయ సిబ్బంది విజయ్, రమేష్, మానస,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ, మాణిక్యపురం సెక్టార్ లో గల అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. పోష కాహార పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా రాజపురం గ్రామంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్య క్రమంలో రాజపురం సర్పంచ్ సనపల జానకిరావు, ఎంపీటీసీ సభ్యులు కృష్ణారావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ మాదిన సుజాత, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ గారు కబ్జాలపై దృష్టిసారించండి

ప్రముఖ వైద్యులు, సామాజిక కార్యకర్త డా.దువ్వాడ

విశాలాంధ్ర - పలాస : పలాస నియోజకవర్గం పరిధిలో గల ప్రభుత్వ ఆస్తులు ముఖ్యంగా పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో భూ కబ్జాలు యదేచ్ఛగా జరుగు తున్నట్లు ప్రచారం వినిపిస్తోందని, ప్రజలు కూడా ఈ కబ్జాల పై ప్రము ఖంగా చర్చించు కుంటున్నారని కలెక్టర్ స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడే విధంగా దృష్టిసారించాలని ప్రముఖ శాస్త్ర చికిత్స వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్త డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జంట పట్టణాల పరిసరాల్లో కబ్జాల వలన పర్యవరణం సమతుల్యం లోపిస్తుందని, మానవ మనుగడకు తీవ్ర విఘాతం కలగడంతో పాటు ప్రజలు కూడా తమ ఆస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కబ్జా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని, దీనిని అరికట్టే క్రమంలో తమ అధ్యక్షతన రాజకీయేతర మరియు వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులైన మేధావులను ఒక కమిటీగా ఏర్పాటు చేసి వాటికి రెవిన్యూ శాఖ సాంకేతిక సహకారం ఇచ్చే విధంగా చేస్తే కబ్జాలకు గురైన ప్రభుత్వ ఆస్తులను గుర్తించి తిరిగి ప్రభుత్వం స్వాధీనం పర్చు కోవచ్చని అన్నారు. ఇదంతా ఒక నిర్ణత కాలపరిమితిలో జరగాలని, కబ్జాలకు గురైన ప్రభుత్వ ఆస్తులు తిరిగి ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంటే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తారని అన్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఈ వ్యవహారం జరిగితే పారదర్శకతతో పాటు సమస్య పరిష్కరించబడుతుందని, దీనికి సహకరించేందుకు జంట పట్టణాల ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు.

పల్లెల్లో పడతుల పాలాభిషేకం

విశాలాంధ్ర - ఆమదాలవలస : గ్రామీణ ప్రాంతంలో గల స్వయం శక్తి సంఘ సభ్యులు పల్లె పల్లెలో సమావేశాలు జరిపించుకొని సంఘం వారి, సభ్యుల వారి, ఎంత డబ్బులు ఇచ్చారు అన్న విషయం అవగాహన చేసుకుని పండగ వాతావ రణంలో రంగవల్లెలు, పచ్చని తోరణాల మధ్య ఘనంగా ఆడపడుచులకు ఆసరా డబ్బులు ఇచ్చి ఆదుకున్న ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకాలు జరుపుతు న్నట్లు వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలి పారు. వంజంగి గ్రామ పంచాయతీలో సచివాలయ పరిధిలో స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ బెండి సత్యవతి తో సహా జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళలంతా ముమ్మరంగా క్షీరాభిషేకం చేసి వారి అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు గ్రామ సంఘం ప్రతినిధులు ,క్లస్టర్ కోఆర్డి నేటర్లు, వివోఏలు స్వయం శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలి

ఎస్ఈబి ఎస్ఐ, సంధ్యారాణి

విశాలాంధ్ర - నరసన్నపేట : యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్.ఈ.బి) ఎస్.ఐ, సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్, డా.లత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎస్.ఐ, సంధ్యారాణి విధ్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యామోహానికి కొంతమంది యువత బలవుతున్నారని, దేశానికి, తల్లితండ్రులకు చెడ్డపేరు తెచ్చే విధంగా యువత ప్రవర్తిస్తున్నారని అన్నారు. మన దేశంలో యువత అధికంగా వున్నారని, ఆ శక్తిని సద్వినియోగం చేసుకోవాలంటే యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, శాంతిహేమ్, అధ్యాపకులు, డా.పి.అన్నాజీరావు, డా.జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని మంజు దంపతులు పరామర్శ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం రంకు హనుమంతపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గోక ఆనందరావు మృతి చెందడంతో, ఆ కుటుంబాన్ని జిల్లా మహిళా సంఘాలు అధ్యక్షురాలు చింతాడ మంజు, గ్రానైట్ సంఘాల అధ్యక్షుడు చింతాడ గణపతి రావు, సోమ వారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోకానంద రావు ఆనంద రావుతో కాంగ్రెస్ పార్టీలో చాలాకాలం కలిసి పనిచేస్తామని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. వారితోపాటు ఎస్సి సెల్ కార్యదర్శి కె. కృష్ణారావు, రూంకు హనుమంతపురం డీలర్ గోక ముకుందరావు, వైకాపా మండల యువ నాయకులు ముద్దపు ఆనందరావు, లోళ్ళ శ్రీనివాస్ రావు ఉన్నారు.

కలసికట్టుగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం

వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర- నరసన్నపేట : నియోజకవర్గంలోని పంచాయితీల వారీగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని, దీనికి మండల అధికారులు తమ వంతు సహకారం అందించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణదాస్ మాట్లాడుతూ మానిఫెస్టోలో చెప్పిన విధంగా శత శాతం పథకాలు అమలు పర్చి, ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన సీఎం, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వచ్చి, రెండవ సారి ముఖ్యమంత్రి కావటం ఖాయమన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ, ఆరంగి మురళీధర్, జెడ్పీటిసి, చింతు అన్నపూర్ణ, వైసీపీ నాయకులు, వంగ బావాజీనాయుడు, చింతు రామారావు, కెసిహెచ్‌బి.గుప్తా, పాగోటి రాజారావు, రాజాపు అప్పన్న, పంచాయితీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు కార్పొరేషన్ డైరక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చిరంజీవిరావును సన్మానించిన తెదేపా యువకులు



విశాలాంధ్ర - సంతమ్మాళి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును సంతబొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ కి చెందిన యువకులు సన్మానం చేశారు. ఇటీవల పోటా పోటీగా జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు గాను, సంతబొమ్మాలి మండలం చెందిన యువకులు బెండి అరుణ్ కుమార్, కుచెట్టి చిట్టి భాను ప్రకాష్ తో పాటు పలువురు యువకులు శాలువ, పూలమాలతో సన్మానించారు.

సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని మాణిక్యపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ లలిత సాహూ ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళా సంఘాల సభ్యులు పాలాభిషేకం చేపట్టారు. వైయస్సార్ ఆసరా మూడో విడత నగదు మహిళా సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేసినందుకుగాను హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సత్యవతి సాహు, పిఎసిఎస్ చైర్మన్ దేవరాజ్ సాహూ, సిఎఫ్ తెలుకుల ఇందిర,భాగ్యవతి,మహిళా సంఘాల సభ్యులు,సచివాలయం సిబ్బంది, గ్రామ వైసీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల అభ్యున్నతికి బ్యాంకు సహకారం తప్పనిసరి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు

విశాలాంధ్ర - ఆమదాలవలస : జిల్లాలో గల షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి కోసం, జీవనో పాధి కార్యక్రమాల మెరుగు కోసం బ్యాంకుల సహకారం తప్పనిసరి అని శ్రీకాకుళం జిల్లా ఎస్సీ కార్పొ రేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కంచరాన రామారావు పేర్కొన్నారు. సోమ వారం మండల పరిధిలో గల గాజుల కొల్లివలస కాలనీలో గల లబ్ధి దారులతో మాట్లాడారు. వారి జీవనో పాదులకు, పరపతి సౌకర్యం పెంపొందించుటకు, గతంలో బ్యాంకుల దగ్గర తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ఉంటే మళ్లీ రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ ఏడాదిలో బ్యాంకుల ద్వారా రుణము తీసుకొని యాక్టివిటీ చేస్తున్న లబ్ధిదారులను పరిశీలించి, వారు చేస్తున్న కార్య క్రమాల స్థితిగతులను ఆదాయ వనరులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ.ఎం. కూర్మారావుతో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ, వి.వో.ఏ. గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ వికాస్ పరిషత్ సభ్యులు నిరసన

విశాలాంధ్ర - మందస : బోయ, వాల్మీకి కులాలను గిరిజన జాబితాలో చేర్చే తీర్మాణాలను ప్రభుత్వం తక్షణమే వెనుకకు తీసుకోవాలని ఆదివాసీ వికాస్ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అసెంబ్లీలో తీర్మాణం చేయ డాన్ని తీవ్రంగా ఖండిస్తూ సోమవారం మందసలో గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేస్తుందని, తీర్మాణాన్ని వెనుకకు తీసుకోకపోతే భవిష్యత్‌లో తీవ్రమైన ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏ ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చే ప్రక్రియను తీసుకోకూడదని, లేకుంటే గిరిజన ప్రజానీకమంతా వైసీపీని భవిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్నాయకులు, జిల్లా జెఎసి అధ్యక్షులు రాంబాబు, అధ్యక్షులు జగన్, డుంబురో, గణేశ్వరరావు, సోమలయ్య, నీలకంటం, దండాసి, జయరాం, కుమార్‌స్వామి, చిత్రసేను, సూర్యరావు, కిరణ్, సూర్యనారాయణ, దుర్యోదన, వెంకటరావు, నందు, రామారావులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాధంలో వ్యక్తికి గాయాలు

ఎన్‌హెచ్ఐ సిబ్బంది నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమంటున్న స్థానికులు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలం జాతీయ రహదారి పాక వలస గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాధంలో వజ్రపుకొత్తురు మండలం కిడిసింగి గ్రామానికి చెందిన బత్తిరి శివ తీవ్రంగా గాయపడ్డాడు. శివ శ్రీకాకుళం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామం కిడిసింగికి వెలుతుండగా పాకివలన వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢి కొనడంతో ఈ ప్రమాధం జరిగింది. ఈ ప్రమాధంలో శివ ఎడమచేయి తీవ్రంగా దెబ్బతింది. ఈ మేరకు స్థానిక ఎస్ఐ ఎస్‌కె మహ్మద్‌అలీ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎన్‌హెచ్ఐ సిబ్బంది రోడ్డుకు మధ్యలో ఉన్న మొక్కలు శుభ్రపరిచేందుకు కిలోమీటర్ల పొడవున ట్రాపిక్ నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేయటం వలన ఇలాంటి ప్రమాధాలు తరచు జరుగుతున్నాయని ఇది కేవలం ఎన్‌హెచ్ఐ సిబ్బంది వైఫల్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపధ్యంలో పాకివలస గ్రామస్థులు నిరసనకు దిగి జాతీయ రహదారి పై భైఠాయించటంలో ట్రాపిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో అక్కడకు చేరుకున్న ఎస్ఐ గ్రామస్థులకు నచ్చజెప్పి ట్రాపిక్‌ను క్రమబద్ధికరించారు.

ఈదురు గాలులు, వడగండ్లతో భారీ వర్షం

విశాలాంధ్ర - మెళియాపుట్టి : భారీ ఈదురు గాలులు, వడగండ్లతో కురిసిన వర్షంతో కరెంటు స్తంభం పడిపోవడం రాకపోకలు కొంత సమ యం స్పందించడం తదితర సమస్యలతో ప్రజలు కొంత సమయం ఇబ్బంది ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే మెళియాపుట్టి మండలంలోని సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం చాలా సమయం వరకు ఎడతెరిపి కురవడంతో స్థానిక తహాశీల్దారు కార్యాలయానికి ఎదురుగా ఒక పాన్ షాపు మెయిన్ రోడ్డు పైకి కొట్టుకొచ్చింది. ఆ సమయంలో వర్షానికి రాకపోకలు లేకపోవడం వల్ల ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. అలాగే పోలీసుస్టేషనుకు దగ్గరలో గల ఒక చిన్నపాటి పండ్ల దుకాణం సైతం నెలకోరగింది. ఆ సమయంలో దాన్ని నిర్వర్తిస్తున్న చిరువ్యాపారి, అతని సోదరి ఆ దుకాణంలో ఉండడం, ఈదురు గాలులకు దుకాణం నేలకోరగడం ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎదురుగా రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో కొంతసేపు ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్, పోలీసు సిబ్బందులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ వైర్లను సరిచేసి వాటిని ప్రజల సహకారంతో అదేవిధంగా ఏర్పాటు చేశారు ఈ సమయంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా పోలీసులు దగ్గరుండి పని జరిగేలా సహాయ సహకారాలు అందించారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో కొంతసమయం విద్యుత్ కు అంతరాయం ఏర్పడింది.

రుణాలను సక్రమంగా చెల్లించాలి

విశాలాంధ్ర - పలాస : పలాస ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రుణాలను తీసుకున్న రైతులు సక్రమంగా చెల్లించి మరో రైతుకు రుణం మంజూరు చేసేలా సహకరించాలని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి) అన్నారు. సోమవారం కార్యా లయం ఆవరణలో భూముల అభివృద్ధి కోసం పది లక్షల రూపాయల దీర్ఘకాలిక చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల 22 లక్షల రూపాయలు దీర్ఘకాలిక రుణాలను రైతులకు అందజేశామని, దీనిలో భాగంగా సోమవారం పలాస మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన వంకల భాస్కరరావుకు 5 లక్షల రూపాయలు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పెంటిభద్ర గ్రామానికి చెందిన సవర సునాధనలకు 5 లక్షల రూపాయలు రుణాలు మంజూరు చేశామని తెలిపారు.

నేడు కలెక్టరేట్ వద్ద సీపీఐ రిలే దీక్షలు

సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర - శ్రీకాకుళం : పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో పాలకుల అలసత్వాన్ని నిరసిస్తూ, పోలవరం ఎత్తు తగ్గించకుండా సకాలం లో పూర్తి చెయ్యాలి కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి లాంటిదని పాలకుల నిర్లక్ష్యం తో పనుకు సకాలంలో పూర్తి కావటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం పై రాజకీయాలు చేస్తుందని, పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కల్పించి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చెయ్యాలి అన్నారు. నిర్వాసితుల పూర్తి న్యాయం చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం బటన్ నొక్కి డబ్బులు లబ్ది దారుల ఖాతాలో జమ చేస్తున్నామని గొప్పలు చెప్పు కుంటు న్నారని, సంక్షేమ పథకాలు తో నే అభివృద్ధి అని చెప్పుకుంటే ఎలా అని, రాష్ట్రం లో మరెలాంటి అభివృద్ధి జరగలేదని, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయా రైందని వెంటనే ప్రాజెక్ట్‌లను సకాలంలో పూర్తి చేసి నిర్వాసితుల అందరికీ ఆదుకోవాలని తదితర డిమాండ్ లతో సీపీఐ పార్టీ అధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న ఈ దీక్షల్లో పెద్ద ఎత్తున సీపీఐ శ్రేణులు, ప్రజా సంఘాలు, కార్మిక, కర్షక, విద్యా, మేధావి వర్గం పాల్గొని జయప్రదం చెయ్యాలని ఆయన కోరారు.

స్పీకర్ పదవికి సీతారాం రాజీనామా చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : నాలుగేళ్ల క్రితం ఎన్నిక అఫిడవిట్ లో డిగ్రీ పూర్తి కాలేదు అని పేర్కొన్న ఏపీ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం మూడేళ్ల లా కోర్సు లో ఎలా చేరగలిగారు అని టీడీపీ జిల్లా అధ్యక్షులు కున రవికుమార్ ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవికి సీతారాం మచ్చ తెచ్చారని వెంటనే ఆయన రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ అఫిడవిట్ లో ఇచ్చిన విద్యార్హత లకు ఇప్పుడు లా చేరడం లో సంబంధ లేదని ఆయన విద్యార్హత లమీద అనుమానాలు ఉన్నాయి దీని మీద స్పీకర్ కి నివృత్తి చెయ్యాల్సిన బాధ్యత ఉందన్నారు. 175 మంది శాసన సభ్యులు కు ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ మా అనుమానాల నివృత్తి చెయ్యాలి అన్నారు. ఈ వ్యవహారం మీద రాష్ట్రపతి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ గవర్నర్ లతో పాటు సుప్రీం కోర్టు న్యాయ మూర్తి కి, హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర ప్రభుత్వం కి పిర్యాదు చేస్తాం అన్నారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి ఆ పదవికి గౌరవం పెంచాలి తప్ప ఇలాంటి పనులతో ఆ పదవికి మచ్చ తీసుకు రాకూడదు అని అన్నారు. ఈ సమావేశం లో టీడీపీ నాయకులు మాదారపు వెంకటేష్, చింతు సుధాకర్, పీఎం జే బాబు, ఎస్ వీ రమణ, జామి భీమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన



విశాలాంధ్ర - కవిటి : చైల్డ్ లైన్ ఇచ్చాపురం సబ్ సెంటర్ ఆధ్వర్యంలో మండలంలోని మాణిక్య పురం గ్రామములో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ జాస్మిన్ కుమారి మాట్లా డుతూ బాలల హక్కులు, లైంగిక వేధింపులు పట్ల తీసుకో వాల్సిన జాగ్ర త్తలు, బాల్యవివాహాలు అరికట్టడం, బాలకార్మికులను ఎలా నివారించాలో వివరించారు. అనంతరం కవిటి మండల చైల్డ్ లైన్ ప్రతినిధి ప్రసాద్ బిసాయి మాట్లాడుతూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై ప్రతి విద్యార్థినికి అవగాహన కలిగి ఉండాలని, బాల బాలికలకు ఎటువంటి సందర్భంలోనైనా రక్షణ, సంరక్షణ కావలసినప్పుడు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, సచివాలయ మహిళా పోలీస్, చైల్డ్ లైన్ సిబ్బంది ఝాన్సీ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ ఆసరా పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలకు బాసట

మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దాలన్నదే జగనన్న ఆశయం : ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర - పాతపట్నం : మార్కెట్ యార్డ్ కమిటీ ప్రాంగణంలో వైయస్సార్ ఆసరా మూడో విడత పంపిణీలో భాగంగా పాతపట్నం నియోజకవర్గం లో ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో 5 మండలాల నుండి విశేషంగా అధిక సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు జరిగిన పొదుపు సంఘాల్లోని మహిళలకు బ్యాంకుల్లో ఉన్న అప్పును తాము అధికారంలోకి వస్తే తీరుస్తామని జగన్ హామీనిచ్చారు. అందులో భాగంగా అధికారంలోకి రాగానే వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని తీసుకువచ్చారు. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో రూ.25,571 కోట్ల అప్పు ఉంది. దీన్ని తీర్చేందుకు ఇప్పటికే 2 విడతల్లో రూ.12,758.28 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. తాజాగా మూడో విడతలో భాగంగా... రూ.6,419.89 కోట్ల మొత్తాన్ని జమ చేశారు. ఈ మొత్తం కలిపితే మూడు విడతల్లో రూ.19,178.17 కోట్లను మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేసినట్లు అవుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు పాతపట్నం నియోజకవర్గం పాతపట్నం మండలంలో అర్హత పొందిన 1080 సం ఘాలకు 11369 సభ్యులకు 5,19,21,170. రూపాయలు ఎకౌంట్లో జమ చేయడం జరిగిందని, మెలియాపుట్టి మండలం లో 983 సంఘాలకు గాను10434 సభ్యులకు5,81,08,367 రూపాయలు సభ్యుల ఎకౌంట్లో జమ చేయడం జరిగిందని, ఎల్ ఎన్ పేట మండలంలో 595 సంఘాలకు గాను 6292 సభ్యులకు 42621383 రూపాయలు సభ్యుల అకౌంట్లో జమ చేయడం జరిగిందని హిరమండలం మండలంలో 790 సంఘాలకు గాను 8369 మంది సభ్యులకు 41911504 రూపాయలు సభ్యుల అకౌంట్లో జమ చేయడం జరిగిందని కొత్తూరు మండలంలో 1052 సంఘాలకు గాను 10967 మంది సభ్యులకు 5,94,96,815 రూపాయలు సంఘ సభ్యుల ఖాతాల్లో జమ అయిందని మొత్తం పాతపట్నం నియోజకవర్గం మొత్తానికి 4500 సంఘాలకు గాను 47,431 మంది సభ్యులకు 254,059,239 రూపాయలు జమ చేయడం జరిగిందని మేనిఫెస్టోలో చెప్పిన విధంగా హామీలు ఇచ్చిన పథకాలను 98.5 శాతం నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం మనదని లేఖలో ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని ఎంతో సంతోషంగా తెలియచేస్తూ అక్క చెల్లె మ్మలందరికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు అనంతరం. మహిళా సంఘాల నాయకులతో కలిసి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వినూత్న పద్ధతికి కేరాఫ్ 'ఫ్యామిలీ డాక్టర్'

రెవిన్యూ శాఖ రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాద్ రావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : వినూత్న పద్ధతికి కేరాఫ్ ఫ్యామిలీ డాక్టర్ అని, ఈ కాన్సెప్ట్ ద్వారా సంచార వాహనాలు ఇంటి ఇంటికి తిరిగి వైద్య సేవలు అందించనున్నాయని రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు సంబంధిత వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుల పరిస్థి తులను దృష్టిలో ఉంచుకుని ఫ్యామిలీ డాక్టర్ అనే విధానాన్ని తీసుకు వచ్చామని అన్నారు. అతి సామాన్య కుటుంబాలకు వైద్య సేవలు అందించేందుకు వీలుగా, పేదల గుమ్మం దగ్గరకు వైద్య సేవలు అందించేవిధంగా ఈ సేవల అందిస్తారు.ప్రతి పీహెచ్సీలో ఉండే ఇద్దరు వైద్యులు రోజు విడిచి రోజు తమకు కేటాయించిన గ్రామాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు అని, దీర్ఘ కాలిక రోగులకు నిరంతరం మందులు, ఇతర వైద్య సేవలు అందించనున్నారు. గ్రామాల్లో ఉండే అతి సాధారణ కుటుంబాలు వైద్యం చేయిం చుకోలేని స్థితిలో ఉంటారు అని, ప్రాణా పాయ స్థితిలో ఉంటారని, ఇటువంటి వర్గాలకు చేరువగా మానవతా దృక్పథంతో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి అన్నారు. అలానే 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉండనున్నాయి అన్నారు. రిఫర్ చేయాల్సి వస్తే సమీప పెద్దాస్పత్రికి రిఫర్ చేస్తారు. దేశంలోనే ప్రథమంగా ఈ సేవలు తీసుకువచ్చామని, వీటి లక్ష్యాలు చేరుకునేందుకు వైద్య సిబ్బంది అంతా కలిసి పనిచేయాలని కోరారు. అలానే గ్రామాల్లో ఉండే ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని ప్రయివేటు వైద్యం పై మక్కువ పెంచుకునే కన్నా ఇటువంటి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని కోరారు. మారిన పరిస్థితుల దృష్ట్యా సర్కారు వైద్యం ఇవాళ ఉన్నత ప్రమాణాలతో అందు తున్నాయి అనేందుకు ఎంతో కృషి చేస్తున్నాం అని అన్నారు. అలానే రిమ్స్ ఆస్పత్రికి 900 పడకలు ఏర్పాటుచేశామని, అలానే వైద్య, వైద్యేతర సిబ్బందిని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. చైతన్య వంతులయిన ప్రజా ప్రతినిధులు ఈ తరహా సేవలపై ప్రజలను ఎడ్యుకేట్ చేయాలని, ప్రభుత్వ వైద్యంను క్షేత్ర స్థాయిలో అందించడంలో భాగంగా అంతా కలిసి సమస్యల పరిష్కా రానికి కృషి చేద్దామన్నారు.ఈ కార్య క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి మీనాక్షి, ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీ తులసి, గొండు రఘు, హాబీ బుల్లా ఖాన్, అందవరపు సంతోష్, 104 కోఆర్డినేటర్ లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రం పనులు పరిశీలిన

విశాలాంధ్ర - నరుబుజ్జిలి : మండలం, కొత్త కోట గ్రామంలోని ఘన వ్యర్థాల ప్రాసె సింగ్ కేంద్రం పనులను ఎంపీడీఓ మురళి మోహన్ పరిశీలించారు. జిల్లా అధికారుల ఒత్తిడి పెరిగిందని, త్వరితిగతిన పనులు పూర్తి చేసి ప్రాసెసింగ్ లోకి తేవాలని తెలియ చేసారు. ఈ కార్యక్రంలో ఈ.ఓ ఆనందరావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషక ఆహారాలతో ఆరోగ్యం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : పోషక ఆహారాలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఇవి అంగన్వాడి కేంద్రాలు ద్వారా అందుతుందని శ్రీకాకుళం ఐసీడీఎస్ ప్రాజక్టు అధికారిణి శోభారాణి అన్నారు. స్థానిక దమ్మల వీధి అంగన్వాడి సెక్టార్ దమ్మల వీధి అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సెక్టార్ పరిధి లో నున్న అంగన్వాడి కార్యకర్తలు పాల్గొని పలు రకాల పోషక విలువలు గల పదార్థాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శన అందరికి ఆకట్టుకున్నాయి.అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పి.ఓ తో పాటు నోడల్ అధికారిని పి.మణి, పర్యవేక్షకురాలు పి.సీతా మహాలక్ష్మీ ఎం.ఎస్.కెలు శ్వేతహరిని, షబానాబేగం, గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడి కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఇచ్చిన మాటనిలబెట్టుకున్నాం..ఆసరా అందించాం

- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఎంత కష్టం అయినా సరే ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను సంబంధిత గ్రూపుల తరఫున తీర్చేందుకు, అదేవిధంగా ముందున్న కాలంలో ఆడ పడుచులకు,అక్కచెల్లెళ్లకు ఆత్మ గౌరవం మరింత పెంచేందుకు మూడో విడత ఆసరా అమలుకు శ్రీకారం దిద్దామని, ఈ పథకంలో భాగంగా ఆ రోజు ఇచ్చిన మాట ప్రకారం స్వయంశక్తి సంఘాలు లేదా డ్వాక్రా గ్రూపు సంఘాలు బ్యాంకులకు బకాయి పడ్డ మొత్తాలను తిరిగి చెల్లించేందుకు ముఖ్యమంత్రి ముందుకు వచ్చారని, అందుకు మనమంతా ఆయనకు రుణపడి ఉండాలని అంటూ రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో మూడో విడత వైయస్సార్ ఆసరా పథకానికి సంబంధించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మాన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు విపక్ష నేత హోదాలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపో యారని, కానీ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే బ్యాంకులకు డ్వాక్రా సంఘాలు కట్టాల్సిన మొత్తాలను ఇప్పటిదాకా మూడు విడతల్లో చెల్లించామని, మరొక్క విడతలో ఇప్పటివరకూ ఉన్న బాకీ మొత్తం చెల్లించడం జరుగుతుందని అన్నారు. ఆ రోజు చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం రైతు రుణమాఫీ అంటూ కూడా ఏవేవో చెప్పిందని, అవేవీ అమలుకు నోచుకోలేదని వాపోయారు. కానీ జగన్ ప్రభుత్వం నేతృత్వంలో ఆ రోజు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. ఆ రోజు 2014 నుంచి 2019 వరకూ రైతు రుణ మాఫీ కానీ డ్వాక్రా సంఘాలకు రుణాల చెల్లింపు కానీ ఏమీ చేయలేదని, కానీ జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారన్నారు. పాద యాత్రలో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టు కున్నారని, అందులో భాగంగా మూడో విడత ఆసరా పథకాన్ని నేడు వర్తింప జేస్తున్నామని చెప్పారు. మాట ఇచ్చి తప్పిన వ్యక్తి చంద్రబాబు అయితే, మాట ఇచ్చి నిలబెట్టుకున్న వ్యక్తి జగన్ అని చెబుతూ, నాటి ప్రభుత్వానికీ ఇప్పటి ప్రభుత్వానికీ ఉన్న తేడా చూడాలని కోరారు. అమ్మ ఒడి కానీ ఇవాళ ఏ పథకం ఆరంభం అయినా అవన్నీ సక్రమంగా అమలు అవుతున్నాయంటే కారణం ఆ రోజు జగన్ సర్కారు బ్యాంకుకు విధిగా డ్వాక్రా రుణాల చెల్లింపునకు శ్రీకారం దిద్దడమేనని అన్నారు. ఇల్లాలి గౌరవం పెంచేందుకు అందుకు తగ్గ విధంగా పథకాల రూప కల్పన, అమలు అన్నవి ఇవాళ చేస్తున్నామని చెప్పారు. కుటుంబ గౌరవం పెంచేందుకు కృషి చేసే ఇల్లాలికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, అందుకే పథకాలన్నింటినీ మహిళల పేరిట వర్తింపజేస్తున్నామని వివరించారు. మహిళాభ్యున్నతికి తమ ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. మహిళలను శక్తిమంతులుగా మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించాలని విన్నవించారు. మీరు రానున్న కాలంలో ఈ ప్రభుత్వానికే మద్దతు ఇవ్వాలని, విపక్షాల ట్రాప్ లో పడవద్దని కోరారు. మీ పెద్దరికాన్ని నిలిపే కార్యక్రమాలన్నింటినీ చేపడుతున్నామని అన్నారు. వీటిని కొనసాగించేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలని మహిళలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈవిషయమై ఆలోచించాలని కోరారు. మళ్లీ జగన్ సర్కారు అధికారం అందుకుంటే మహిళా సాధికారికత అన్నది సాధ్యమని, ఇల్లాలి గౌరవం మరింత రెట్టింపు కావడం సాధ్యం అవుతుందని చెప్పారు. అందుకే మహిళలకు ఆర్థిక స్వావలంబన ఇస్తున్న జగన్ కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వాలు జీవితాన్ని మారుస్తాయి అని, మన బతుకులను మార్చే ప్రభుత్వానికి అండగా ఉండాలని పిలుపు ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆ రోజు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని అన్నారు. జగన్ ను ఉద్దేశించి పథకాల అమలు విషయమై అనేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అవేవీ నమ్మవద్దని, రానున్న కాలాన మేలు చేసే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కొందరు గందరగోళం సృష్టించి కొందరి ఓట్లు దొంగిలించాలని చూస్తున్నారని, వాటిని నిలువరించి, ప్రభుత్వం నుంచి ప్రయోజనం పొందిన మీరంతా మరోసారి మద్దతు ఇవ్వానలి కోరుతున్నానని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని నిలిపే శక్తి ప్రజలకే ఉంది అని, అందులో సగం ఉండే మహిళలు ఈ ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. జడ్పీ చైర్మన్ పిరియా విజయ, పిడి డిఆర్డిఏ విద్యాసాగర్, సిడిపిఓ రాధా మాధవి, మాజీ రాష్ట్ర మహిళ కమీషన్ చైర్మన్ త్రిపురాన వెంకట రత్నం, మాజీ మున్సిపల్ చైర్మన్ మెంటాడ పద్మావతి, ఎంపిపి గోండు రఘురాం, జడ్పిటిసి మార్పు సుజాత, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ గోండు కృష్ణ, ముంజేటి కృష్ణ, మార్పు పృథ్వి, యాల్లా నారాయణ తదతరులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తు నిర్ణీత సమయంలో పరిష్కరించాలి

ఆర్జీ దారులకు సంతృప్తి కరమైన పరిష్కారం చూపాలి

అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ ఎం నవీన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రతీ దరఖాస్తును నిర్ణీత సమయంలో పరిష్కరించాలి, ఆర్జీ దారులకు సంతృప్తి కరమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించడమా లేదా తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలని తిరస్కరించదలిస్తే సరైన కారణాలు తెలపాలన్నారు. మండల స్థాయిలో కూడా క్వాలిటీ డిస్పోజల్ పెరగాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్పందన కార్యక్రమంలో ఏ ఒక్కరు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించకుండా జవాబుదారి తనంతో పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో 196 మంది అర్జీదారులు తమ సమస్యలపై జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తులు అందజేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరీ, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీ కృష్ణ, ఉప కలెక్టర్ జయదేవి, డి.ఆర్.డి.ఎ., పి.డి విద్యాసాగర్, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ వెంకట్రామన్, మెప్మా పి.డి కిరణ్, జిల్లా వైద్య ఆరోగ్యం అధికారి బి. మినాక్షి, డి.ఎస్.ఓ వెంకటరమణ, డి.పి.ఓ రవికుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్.వి పాలెంలో పౌష్టికాహార వారోత్సవాలు

విశాలాంధ్ర - భీమిలి : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ లోడగల రమణ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి మహిళ తీసుకోవాలన్నారు ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ఐరన్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, రాగిజావ ను తీసుకోవాలన్నారు.తక్కువ ఖర్చుతో దొరికే కాయగూరలు, బెల్లం ఉండలు రాగి పిండిలో ఎక్కువ పోషకాలు ఉంటాయన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.వి రత్నం మాట్లాడుతూ పౌష్టికాహారం పై అవగాహన పెంచాలన్నారు . బలమైన ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ కార్యాచరణపై వినతులు

శాలాంధ్ర - పాడేరు : బోయవాల్మీకి, బెంతుఒరియా కులలాను ఎస్ టీ జాబితాలోకి జాబితాలోకి చేరుస్తూ రాష్ట్ర అసెంబ్లీ తేదీ 24 ఫిబ్రవరి నాడు తీర్మానం చేసింది ఈ తీర్మానం రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద కేంద్ర ప్రభుత్వానికి ఢిల్లీకి పంపించడం జరిగిందని పేర్కొన్నారు. ఆదివాసులు నేడు ఎన్నో సమస్యలతో కొట్టు మిట్టాడు తున్నప్పటికీ వాటిని ఏనాడు పట్టించుకోని ప్రభుత్వం ఇతర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఉద్దేశించిన జీవోను సామ్యూల్ ఆనంద్ కమిటీని నియమిస్తూ వాటిని వెంటనే తీసుకొని అశాసస్త్రియమైనా పద్ధతిలో దొడ్డిదారిన అసెంబ్లీలో తీర్మానం చేసి ఆదివాసులకు ప్రస్తుత ప్రభుత్వ వెన్ను పోటు పొడిచిందని అన్నారు. ఈ తీర్మానంను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్లోని మన్యం ప్రాంతాలన్నీ మన్యం ప్రాంతమంతా ఉద్యమాల బాట పడ్డాయని అందులో భాగంగా నేడు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కి మరియు జిల్లా సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ కి వినతి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి మండలంలో ఆయా మండల శాఖలు ఆ మండల తహసిల్దార్లకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు

భారీగా పెరిగిన ఆదాయం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో వీధి గుత్తా, దినవారి బజారు, కమేళా, పాత పత్రికల విక్రయం, కొబ్బరి చెట్ల ఫల సాయం కోసం కమీషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో రెండవ పిలుపుతో వేలం పాట సోమవారం నిర్వహించారు. ఒకప్పటి వసూలుదారుడు పిట్ట భైరాగి పేరున దినవారి మార్కెట్ వీధిగుత్త, కమేళా, లైబ్రరీలో పాత పత్రికల విక్రయాలకు సంబంధించిన వేలాన్ని మరోసారి దక్కించుకున్నాడు. వీధిగుత్త దినవారి బజారులో శిస్తు వసూలుకు గత ఏడాది రూ॥ 22.23 లక్షలు కాగా ఈ ఏడాది (2023-24)కు వేలం పాటను అమాంతం పెంచేసి రూ॥ 28.90 లక్షల రూపాయలకు, గత ఏడాది రూ 1.21 లక్షలుగా ఉన్న కమేళా వసూలు ఈ ఏడాది (2023-24) కు రూ 1.55లక్షలు రూపాయలకు, లైబ్రరీ పాత పేపర్ల అమ్మకానికి గత ఏడాది 4,800 రూపాయలు కాగా ఈ ఏడాది (2023-24) కు 6,200 రూపాయలకు పిట్ట బైరగి హెచ్చు పాటాదారుగా నిలవడం పాటలు అతని పేర అధికారులు ఖరారు చేసారు. గతంలో కొబ్బరిచెట్ల ఫలసాయం ఏడాది 3200 రూపాయలు కాగా ఈ ఏడాది (2023-24) కు 3,550 రూపాయలకు దక్కత విశ్వేశ్వరరావు దక్కించుకున్నారు. మున్సిపల్ మేనేజర్ దుర్గా హరి మోహన్, ఆర్.ఐ అమర్, సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంల సహకారంతో వేలం పాటలను కమీషనర్ నిర్వహించారు.

వైభవంగా సంబరాల శుభరాట

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల ప్రారంభానికి ఏర్పాటు చేసే శుభరాట కార్యక్రమాన్ని వేద మంత్రోశ్ఛరణలు, మంగళ వాయిద్యాలతో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సురంగి సంస్థానాధీశులు కొలిచే కురేసిని అమ్మవారి ప్రాంతం నుంచి తీసుకువచ్చి కోట వద్ద ఉంచిన శుభరాటకు పూజలు చేసిన అనంతరం, స్థానికులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయానికి అక్కడి నుంచి ఉప్పల వీధిలో అమ్మవారి మండపానికి వేడుకగా తీసుకువచ్చి పాతిపెట్టారు. దాంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

విశ్రాంత ఉద్యోగుల భవన స్థలం కోసం వినతి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉండే విశ్రాంత ఉద్యోగులు సమావేశమై చర్చించుకునేందుకు, వారి సంఘ సమావేశాలు నిర్వహించుకోవడానికి గాను భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని స్థానిక ఎలియన్స్ క్లబ్ కోరింది. ఈ మేరకు క్లబ్ ప్రతినిధులు సోమవారం తహశిల్దార్ ఎస్.గురుప్రసాద్కు వినతిపత్రాన్ని సమ ర్పించారు. క్లబ్ కార్యదర్శి తిప్పన లక్ష్మణరావు ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించిన కార్యక్రమంలో వి.ఆర్.ఓ దక్కత గోపీనాథ్, బుజ్జి, బాల, యోగి, బాలక్రిష్ణ, ఉమాశంకర్లతో పాటు విశ్రాంత ఉద్యోగులు మోహనరావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఊడికలపాడులో శ్రీరామనవమి ఉత్సవాలు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలంలోగల చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామంలో మంగళవారం నుంచి ఈనెల 30వ తేదీ గురువారం వరకు శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించటం జరుగుతుందని ఆలయ నిర్మాణకర్త సనపల కరుణ్కుమర్ అన్నారు. మంగళవారం ఉదయం స్వామివారి తీరువీధి అనంతరం గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించటం జరుగుతుందని, బుధవారం మహిళలచే స్వామివారికి కుంకుమ పూజలు, గురువారం ఉదయం 9 గంటలనుంచి వేదపండితులు సుసరాపు చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో సీతారామ కళ్యాణంను 10 మంది జంటలచే నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ మూడు రోజులు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని అలాగే గురువారం మద్యాహ్నం 12 గంటనుంచి మహా అన్నసమారాధన నిర్వహించటం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాధం స్వీకరించాలని కోరారు.

స్మశాన వాటికలో జంగిల్ క్లియర్ చేసిన గ్రామస్తులు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలం నరసాపురం గ్రామంలో ప్రజలందరికీ అవసరమైన స్మశాన వాటికలో ఎంపీటీసీ మోడీ రామచంద్ర ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ చేశారు. స్మశాన వాటికలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పొక్లెయిన్ తో మట్టిని వేయించారు. అలాగే ప్రజలందరికీ ఉపయోగరమైన చెరువు వద్ద జంగిల్ క్లియరెన్స్ చేసి, స్నానాలు అనుకూలంగా త్రోవ చేశారు. శ్రమదానంతో చేసిన ఆయా కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు ఉన్నారు.

యూటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా మురళీ ప్రకాష్

విశాలాంధ్ర - కవిటి : యూటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా మురళీ ప్రకాష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కవిటి మండల శాఖ సభ్యులు తెలిపారు.పలాస లోని నాగటి నారాయణ ప్రాంగణం (రైల్వే ఇన్స్టిట్యూట్)లో యుటిఎఫ్ 17వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలో కవిటి మండలంకు చెందిన పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం మురళి ప్రకాష్ ను జిల్లా కార్యదర్శి గా ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కవిటి మండలంలోని పలువురు ఉపాధ్యాయులు,కవిటి మండల యుటిఎఫ్ శాఖ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

చిరంజీవి శ్రేయ మిస్రాకు నర్తన సౌందర్యలహరి అవార్డు ప్రధానం

విశాలాంధ్ర - పాతపట్నం : శ్రీలలిత కళా నృత్యానికేతన్ వారు శోభ కృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా నాట్య గురువు డా.ఏ.ఆంజనేయులు ఆధ్వర్యంలో రాజ మహేంద్రవరంలో ఆదివారం రాత్రి అందెలరవళి - సౌందర్యలహరి అను భారతీయ నృత్యోత్సవం-6 కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో నాట్యకారిణి పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన చిరంజీవి శ్రేయా మిశ్రా చేసిన నాట్యానికి గాను నర్తన సౌందర్య లహరి అవార్డును అందించారు, ఈ అవార్డుతోపాటు మేమంటో ను బహుకరించారు.

మార్చి 29న స్వామి వారి హుండీ లెక్కింపు

సహాయ కమీషనర్ వి.హరిసూర్యప్రకాష్



విశాలాంధ్ర - అరసవల్లి : అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి హుండీలను లెక్కించ నున్నట్లు సహాయ కమీషనర్ మరియు కార్య నిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. మార్చి 29వ తేది బుధవారం ఉదయం 8గం.లకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్త, అర్చకులు, భక్తులు మరియు గ్రామపెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

ప్రతి ఒక్కరూ ప్రధమ చికిత్సపై అవగాహన కలిగిఉండాలి

విశాలాంధ్ర - అరసవల్లి : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి, శ్రీకాకుళం జిల్లా రెడ్ సారధ్యంలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం శాంతా కల్యాణ అనురాగ నిలయంలో నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ ఛైర్మన్ పి.జగన్ మోహన్ రావు హాజరై ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఫస్ట్ ఎయిడ్ పై అవగాహన కలిగి ఉండడం ద్వారా తమను తాము కాపాడుకోవడంతో పాటు ఇతరులను కూడా కాపాడవచ్చు అన్నారు. పెంకి చైతన్య రక్తదానం పై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి ఆర్ శ్రీకాంత్, పెంకి చైతన్య కుమార్, బి.శ్రీధర్, బి.సతీష్ కుమార్, కె.సత్యనారాయణ, ఫస్ట్ ఎయిడ్ అంటే ఏమిటి, కృత్రిమ శ్వాస, కాలిన గాయాలు, ఎముకలు ఇరుగుట రక్తస్రావం, డ్రెస్సింగ్ కట్లు, తరలించి పద్ధతులు, గుండెపోటు, తదితర అంశాలను బోధించారు. అలాగే అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఔత్సికులు 10 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

పాఠశాలలకు స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని బొరివంక స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల 16 పాఠశాలలకు స్కూల్స్ కాంప్లెక్స్ చైర్మన్ సనపల రామకృష్ణ చేతుల మీదుగా స్పోర్ట్స్ మెటీరియల్ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. సుమారు 20 వేలు రూపాయలు టిఎల్ ఎం, స్పోర్ట్స్ మెటీరియల్ కొనుగోలు చేసి 16 పాఠశాలలకు పంపిణీ చేసినట్లు స్కూల్స్ కాంప్లెక్స్ చైర్మన్ సనపల రామకృష్ణ, సెక్రటరీ త్రిలోచన్ బిసాయి, వైకుంటారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి తులసి 16 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణ వైసీపీ అధ్యక్షులుగా సనపల ?

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షులుగా 19వ వార్డు కౌన్సిలర్ సనపల సింహాచలంను నియమించేందుకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పట్టణ అధ్యక్షులుగా వ్యవహరించిన కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మున్సిపల్ ఎన్నికల తరువాత చైర్మన్ పదవీని ఆశించిన భంగపడడంతో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును విభేధిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో దువ్వాడ శ్రీకాంత్ను పట్టణ అధ్యక్ష పదవీ నుంచి తప్పించి కాళింగ కులానికి చెందిన సనపల సింహాచలంను నియమిస్తే అన్ని విధాలుగా పార్టీకి పనికి వస్తారని భావించినట్లు తెలుస్తోంది.

నాణ్యతతో సీసీ రోడ్డు పనులు చేపట్టాలి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం వంకులూరులో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని ఎంపిటిసి కొండప్ప సుందరమ్మ, ఆది బలిజ సంఘం అధ్యక్షులు లండ శ్రీనులు అన్నారు. ఒంకులూరు అమ్మవారి గుడి నుంచి ఎన్ఆర్జిఎస్ నిధులు 80 వేల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధులకు సిసి రోడ్లు నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో అప్పారావు, జగన్నాధం, దిలీప్, వల్లభరావులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సలకు 90 మందిని ఎంపిక చేసిన శంకర్ ఫౌండేషన్

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలోని చిత్రివీధి ఆవరణలో వున్న శ్రీ సత్యసాయి మందిరంలో సోమ వారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డా.బాలగంగాధర్రాజు ఆధ్వర్యంలో సుమారు 200 మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. వీరిలో 90 మందిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్కు శస్త్ర చికిత్సల కోసం తరలిస్తామని మొదటి విడతగా 50 మందిని, వచ్చే 29వ తేదీ నాడు మిగిలిన 40 మంది రోగులను శస్త్ర చికిత్సల కోసం తరలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి మందిరం కన్వీనర్, వైశ్యరాజు నాగేశ్వరరాజు, కె.ఎల్.ఎన్.మూర్తి, పూణ్ణ సన్యాశిరావు, విజయలక్ష్మీ, చిత్రి ప్రసాద్రావు, వేణు, క్యాంప్ కోఆర్డినేటర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదలను చట్ట పరిధిలో పూర్తిగా పరిష్కరించాలి.

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : 'స్పందన' కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కారంచూపి నిర్ణీత సమయంలోగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ రాధిక పోలీసు అధికారులును ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందేకు నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో 39 మంది ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్పీతో పాటు ఆదనపు ఎస్పీ విఠలేశ్వరావు ఫిర్యాదులు స్వీకరించారు.ఫిర్యాదిదారులు తమ తమ అభ్యర్థనలను వ్రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలును అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు వివరాలు ఇలా. మోసపూరితమైన ఫిర్యాదులు 04, కుటుంబ తగదాలుకు సంబంధించినవి 05 ఫిర్యాదులు, ఆస్తి తగాదాలుకు సంబంధించిన పిర్యాదు 6, పౌర సంబంధాల పై 05, మిస్సింగ్ 01,హెర్స్మెంట్ 03, పాత పిర్యాదులు 08, ఇతరములుకు సంబందించినవి 07 పిర్యాదులు వచ్చినవి. జిల్లా ఎస్పీ, వారి ఆర్జీలను, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. టెలిఫోన్ ద్వారా సంబంధిత అధికారులుకు పిర్యాదుదారుల వివరాలు,వారి సమస్యలను తెలియపరచి, తగుచర్యలు తీసుకోవలసిందిగా, ఫిర్యాది దారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించవలసిందిగా సంబంధిత అధికారులుకు ఆదేశించారు. ఈ పిర్యాదులు పై తీసుకున్న చర్యలపై కూడా, తనకు ఎప్పటికప్పుడు నివేదిక అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు.

హిందూ దళితులకు అన్యాయం జరుగుతుంది

ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి లింగరాజు

విశాలాంధ్ర - టెక్కలి : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో హిందూ దళితులకు అన్యాయం జరుగుతుందని భారతీయ జనతా పార్టీ ఎస్సి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి లింగరాజు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరే వేరే మతస్తులను ఎస్సీ లో చేర్చి ఎస్సీ వాళ్లకి అన్యాయం చేస్తున్నారని ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లిస్తున్నారని ఎస్సీ వాళ్ళకి రావలసిన 21 రకాల నిధులు ఇచ్చేవరకు పోరాటం చేయాలని వచ్చే ఎలక్షన్లో ఎస్సీలు జీరో ఓటుతో జగన్మోహన్ రెడ్డిని ఓడించాలని అన్నారు.అనంతరం మత మార్పిడులకు ప్రోత్సహిస్తూ నిర్ణయం తీసుకొన్న వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం కు వ్యతిరేకంగా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలపారు. ఈ కార్యక్రమానికి చిట్టిబాబి, యువమోర్చా జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు జర్ని పరమేష్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ధూపాన కామేశ్వర రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రాజకుమార్ రెడ్డి,బిజెపి నాయకుల వాసు తదితరులు పాల్గొన్నారు.

డ్రాఫ్ రూల్స్ పై అభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర - ఆమదాలవలస : మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్పై సవరణ చేసేందుకు ఉపాధ్యాయుల అభిప్రాయాలు సేకరణ చేస్తున్నట్లు ఎస్టియు జిల్లా అధ్యక్షులు వడాల తమ్మి నాయుడు తెలిపారు. ఎంఆర్సి కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్ కు కొనసాగించాలన్నారు. హెచ్ఎం అకౌంట్ టెస్ట్ పాస్ అయిన ఉపాధ్యాయులకు మిగిలిన టెస్టుల్లో మినహాయింపు ఇవ్వాలన్నారు. అర్బన్ ఎంఈఓలకు ప్రమోషన్లలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జిల్లాలోని సంఘాల్లోని ఉపాధ్యాయులకు కామన్ సర్వీసులు మేరకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకర రావు , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ వి రమణ మూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ చింతల రామారావు, బొడ్డేపల్లి రమేష్, సిమ్మ రామచంద్రరావు, బగాన రమణమూర్తి, భారతి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల వద్ద..న్యూసెన్స్!

రోడ్లపై మందుబాబుల చిందులు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మందు తాగుతాం.. కొట్టుకుంటాం.. తిట్టుకుంటాం.. అడ్డిస్తే మిమ్మల్ని కొడతాం..అంతా మా ఇష్టం.. అడిగేందుకు మీరెవరు..అంటూ మందుబాబులు రెచ్చిపోతున్నారు. రాత్రి 8గంటలు దాటితే కోటబొమ్మాళి మద్యం షాపుల వద్ద నిత్యం ఇదే పరిస్థితి.. రాత్రి 8గంటల తరువాత రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు ముఖ్యంగా మహిళలు భయపడుతున్నారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో ఇండియన్ బ్యాంక్ పక్కన ఉన్న మద్యం షాప్ వద్ద రోడ్డుపైనే ఇద్దరు యువకులు మద్యం మత్తులో కొట్టుకున్నారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడి చేసుకున్నారు. స్థానికులు వారిని నివారించేందుకు ప్రయత్నించగా వారిపైనే తిరగబడ్డారు. అంతా మా ఇష్టం అంటూ న్యూసెన్స్ చేస్తూ అక్కడివారిని భయ భ్రాంతులకు గురిచేయడంతో చుట్టు పక్కల నివాసముంటున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం మందుబాబులు మద్యం తాగి చిందులు వేస్తూ కొట్టు కోవడం.. కేకలేయడం మాములుగా మారిపోయిందని పట్టించుకునవారు లేకుండాపోయారని పలువురు ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి 8గంటల తరువాత వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు, మహిళలు కోటబొమ్మాళి చివర సంతబొమ్మాళితో పాటు తదితర గ్రామాలకు వెళ్ళేందుకు పెద్ద చెరువు వద్ద బస్సులు, ఆటోల కోసం వేచి సమయంలో మందుబాబుల వీరంగం చూసి భయాందోళనకు గురవుతున్నామని ప్రయాణీకులు వాపోతున్నారు. పోలీసులు అడపా దడపా హెచ్చరిస్తున్నప్పటికీ మందుబాబులు మద్యం మత్తులో మేమింతే..ఎవరి మాట వినం.. అంటూ మందుబాబులు ఊగిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రజల ఇబ్బందులు దృష్టిలో మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.